www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 21 నవంబరు 2022

నేడు యధావిధిగా స్పందన

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల 21వ తేదీ సోమవారం ఉదయం పది గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోనూ 'స్పందన' కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి యధావిధిగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి భౌతిక దూరం పాటించాలని పేర్కొన్నారు.

గోనె సంచులివ్వండి.. ధాన్యం కొనండి

ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన రైతుల ధర్నా

ధాన్యం కళ్లాల వద్ద నినదిస్తున్న రైతు నేతలు, రైతులు

ప్రజాశక్తి - నిడమర్రు

రైతుల నుంచి సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో అడవికొలను గ్రామంలో రైతుభరోసా కేంద్రం సమీపంలోని ధాన్యం కల్లాల వద్ద రైతులు, కౌలు రైతులు ఆదివారం ధర్నా నిర్వహించారు. గోనె సంచులు ఇవ్వండి.. ధాన్యం కొనండి అంటూ ధాన్యం కల్లాల్లో నినదించారు. ధాన్యం రాశులుగా వేసి 15 రోజులవుతున్నా కొనుగోలు చేయడం లేదంటూ అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో కొత్త విధానం తీసుకొచ్చామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెబుతున్నా ఆచరణలో ధాన్యం కొనుగోళ్లలో రైతులను అనేక ఇబ్బందులకు గురి చేయడం దారుణమని విమర్శించారు. ఆరుగాలం కష్టపడి పంట పండిస్తే కొనుగోలు చేయకపోవడం వల్ల అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు 34 బస్తాలు మాత్రమే కొనుగోలు చేస్తామని, కొనుగోలు పరిమితి వల్ల మిగిలిన పంట ఎవరికి అమ్ముకోవాలో అర్థం కావడం లేదని అన్నారు. కొనుగోలు పరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. గోనె సంచుల కొరత తీవ్రంగా ఉందని, రైతులకు సరిపడా గోనె సంచులు అందించాలని కోరారు. వే బ్రిడ్జి కాటా వద్ద ఏ మిల్లుకు ధాన్యాన్ని పంపాలో చెప్పడం ఆలస్యమవుతోందని, దూరప్రాంత మిల్లులకు పంపేందుకు వాహనదారులు ముందుకు రాకపోవడంతో రవాణా సమస్య తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. హమాలీలు అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రవాణా వాహనం, హమాలీలను ప్రభుత్వమే ఏర్పాటుచేసి కల్లాల నుండి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా నాయకులు పి.కిషోర్ రైతుల ఆందోళనకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పమ్మి గోవింద్, పైడికొండల ఏసుబాబు, మండా రామకృష్ణ, కొమ్ముల సుబ్బయ్య, కోటిపల్లి రాము, యాళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: రైతులు, కౌలు రైతుల నుండి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో కైకరంలో ఆదివారం ధాన్యం కల్లాల వద్ద ధర్నా నిర్వహించారు. రైతు సంఘం నాయకులు ఉమండలంలోని కైకరం, చేబ్రోలు, నారాయణపురం గ్రామాల్లో పర్యటించి కల్లాల్లోని ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు మాట్లాడుతూ వాతావరణ మార్పులతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు వెంటనే గోనె సంచులు ఇవ్వాలని కోరారు. కొనుగోలు పరిమితి పెంచాలని, తేమశాతం 17 కాకుండా 14గా ఉండాలని చెప్పడం సరికాదన్నారు. ధాన్యం కొనుగోలు చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, కర్రి చెన్నారావు, కోటేటి శ్రీనివాసరావు, చింతాడ నాగేశ్వరరావు, గున్ను నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

కార్మికుల శ్రమ కార్పొరేట్లకు ధారాదత్తం

కేంద్రం తీరుపై సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు

రెండోరోజు కొనసాగిన సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికుల శ్రమను దోచుకుని దానిని కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. మహిళా ఉద్యమనేత, సిఐటియు నాయకురాలు జి.విజయలక్ష్మి నగర్ (కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపం)లో నిర్వహిస్తున్న సిఐటియు జిల్లా మహాసభలో రెండోరోజైన ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను కేంద్ర ప్రభుత్వం మోసగించిందన్నారు. పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులు, అమలవుతున్న చట్టాలు అన్నీ యజమానులకు అనుకూలంగా మారిపోయాయన్నారు. ఎనిమిది గంటల పని విధానం 12 గంటలకు మార్చాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కేంద్రం ప్రభుత్వ అడుగు జాడల్లో నడుస్తోందన్నారు. కేంద్రం విధానాలను తుచ తప్పకుండా అమలు చేస్తోందని విమర్శించారు. నూతన విద్యావిధానం, లేబర్ కోడ్‌లు, విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై ఛార్జీల భారం ఇలా అన్ని అంశాల్లో రాష్ట్రం బిజెపి చెప్పినట్లు చేస్తుందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం ఇప్పటికే బ్యాంకింగ్, టెలికాం, విద్యుత్ వంటి వాటిని ప్రయివేటీకరించిందని, బీమా, రైల్వే, విమానయానం, కోల్, పోస్టల్, రక్షణ రంగాలు సైతం ప్రయివేటీకరిస్తుందని తెలిపారు. ఆఖరికి ఆంధ్రుల హక్కు.. విశాఖ ఉక్కు అనే నినాదంతో ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిని అడ్డుకోకపోగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాని మోడీ విశాఖపట్నం వచ్చినప్పుడు సాదర స్వాగతం పలికి, ఆయన చెప్పిన కల్లిబొల్లి కబుర్లకు తలాడించిందని విమర్శించారు. ఒకే దేశం ఒకే పన్ను అంటూ బిజెపి ప్రభుత్వం జిఎస్‌టి పేరుతో ప్రజలపై మోయలేని భారం మోపిందన్నారు. ఆహార పదార్థాలపై కూడా పన్ను వేసిన ఘనత నిర్మలమ్మకే చెందుతుందన్నారు. సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, ఉద్యోగ ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. సభలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.స్వరూపరాణి, కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు తదితరులు మాట్లాడారు. రెండోరోజు మహాసభలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రతినిధులు వివిధ అంశాలపై నిర్వహించిన చర్చల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.సోమయ్య, డిఎన్‌విడి ప్రసాద్, నేతలు ఆర్.లింగరాజు, పి.కిషోర్, వి.సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

27న గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర ప్రథమ మహాసభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 27న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర ప్రథమ మహాసభ నిర్వహించనున్నట్లు ఎపి జెఎసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ తెలిపారు. స్థానిక రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 12 వేల పైచిలుకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులంతా ఈ సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు. విజయవాడలోని లెనిన్ సెంటర్ చేరుకొని అక్కడి నుండి భారీ ర్యాలీగా తుమ్మలపల్లి కళ క్షేత్రం వరకూ చేరుకుంటామని తెలిపారు. ఈ సభకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా వస్తారన్నారు. సచివాలయ ఉద్యోగులపై పని భారం తగ్గించాలని, ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని కోరారు. అనంతరం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉద్యోగుల డివిజన్, మండల కమిటీలను నియమించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు హుస్సేన్, శివశంకర్, ఏలూరు జిల్లా అధ్యక్షులు కమల్, కార్యదర్శి సాయినాథ్, రాష్ట్ర మహిళా విభాగ నాయకురాలు జ్యోతి పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించిన జెఎసి నేతలు

ధాన్యంసేకరణపై జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్

ఆర్‌బికెల్లో అందుబాటులో గోనె సంచులు

జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎ.మంజుభార్గవి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ధాన్యం సేకరణకు సహకార సంఘాల ద్వారా రైతు భరోసా కేంద్రాల వద్ద అవసరమైన గోనె సంచులను సిద్ధం చేశామని జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎ.మంజుభార్గవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ సహకార సంఘాల వద్ద సుమారు 20 లక్షల గోనె సంచులు సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. ప్రభుత్వం ధాన్యం రవాణాకు రైతులకు ఎటువంటి అసౌకర్యమూ కలుగకుండా లారీ అసోసియేషన్, మిల్లర్ల అసోసియేషన్ ద్వారా వాహనాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. రైతులు ధాన్యాన్ని ఆర్‌బికె కేంద్రాల వద్ద నుండి రైస్‌మిల్లులకు రవాణా చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిపై అవసరమైన చోట్ల క్షేత్రస్థాయిలో మండలాలవారీగా సంబంధిత అధికారులను నియమించామని తెలిపారు. వాతావరణంలో వచ్చే మార్పులకు అనుగుణంగా రైతుల ధాన్యానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఫోన్ ద్వారా రైతులకు తగిన సూచనలు సలహాలు అందిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన వారు 7702003584, 7569562076, 7569597910, 8500730430 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

రిజర్వేషన్ల అమలుతోనే దేశాభివృద్ధి

బిసి సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశంలో 70 శాతంగా ఉన్న బిసి కులాలకు వాటా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తేనే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని బిసి సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం ఏలూరు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా బిసిలకు అనేక సంక్షేమ కార్యక్రమాలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. జగన్మోహన్‌రెడ్డి బిసిలను కుటుంబ సభ్యులుగా చూస్తే చంద్రబాబునాయుడు మాత్రం కేవలం ఓటుబ్యాంకుగానే చూస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంటులో బిసి బిల్లును ప్రవేశ పెట్టాలని 16 పార్టీలు ఇప్పటికే మద్దతిచ్చాయని, మద్దతు ఇవ్వని పార్టీలను దేశం నుంచి తరిమికొట్టాలని, రానున్న ఎన్నికల్లో ఓడించాలని అన్నారు. చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఈ నెల 24న ఢిల్లీలో ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నామని, దీన్ని జయప్రదం చేయాలని కోరారు.

పేరుపాలెంలో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ పర్యాటకులతో కళకళలాడింది. కార్తీక మాసం ఆఖరి ఆదివారం కావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. పిల్లలు, పెద్దలు తారతమ్యం లేకుండా కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. అనంతరం సమీపంలోని ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపక్తి భోజనాలు చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకూ ఆనందంగా గడిపారు. సిఐ వాడపల్లి సురేష్ బాబు పర్యవేక్షణలో సిబ్బంది బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. బీచ్‌లో రెవెన్యూ మత్స్యశాఖ ఆరోగ్య పంచాయతీ శాఖల సిబ్బంది విధులు నిర్వహించారు.

క్షతగాత్రుల కుటుంబాలను కేరళ పంపాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

కేరళలోని శబరిమల యాత్రకు వెళ్లొస్తూ ప్రమాదానికి గురైన వారి కుటుంబ సభ్యులను తక్షణం క్షతగాత్రుల వద్దకు పంపేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను సిపిఎం బృందం ఆదివారం పరామర్శించింది. కేరళ బస్సు ప్రమాదంలో గాయపడిన మాదేపల్లి కాలనీకి చెందిన ప్రసాదం గోపీ, తరగర్ల రాజేష్, పాసెం మణికంఠ, బత్తిన రాజశేఖర్ కుటుంబాలను నేతలు కలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కేరళ ప్రభుత్వం వెంటనే స్పందించి వైద్య సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఘటన జరిగిన వెంటనే స్థానిక ఎంఎల్ఎ, మంత్రి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన చికిత్స అందించేలా పర్యవేక్షించారన్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కుటుంబ సభ్యులంతా తమ వారు ఎలా ఉన్నారని అల్లాడుతున్నారని, ఇప్పటికైనా ఎంఎల్ఎ, జిల్లా అధికారులు స్పందించి క్షతగాత్రుల కుటుంబ సభ్యులను కేరళ పంపే ఏర్పాట్లు చేయాలని కోరారు. బృందంలో సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, నేతలు పివి.రామకృష్ణ, కె.రామాంజనేయులు, వివివిఎన్.ప్రసాద్, లెనిన్, జి.కోటేశ్వరరావు, ఎల్.సత్యనారాయణ, జి.రవి తదితరులు పాల్గొన్నారు.

బాధితుల కుటుబాలతో మాట్లాడుతున్న నేతలు



నారాయణపురంలో దరఖాస్తులు అందిస్తున్న యువకులు

ఓటు హక్కు కోసం యువత క్యూ

రెండు రోజుల్లో 2007 దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఉంగుటూరు

కొత్తగా ఓటు హక్కు కోసం యువత క్యూ కట్టారు. భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, ఓటు బదిలీ దరఖాస్తుల స్వీకరణకు అధికారులు ఈ నెల 19, 20 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఉంగుటూరు నియోజకవర్గంలో 213 పోలింగు కేంద్రాల్లో ఈ దరఖాస్తులను స్వీకరించారు. 18 నుంచి 19 ఏళ్ల వయస్సు వారు 828 మంది, 19 ఏళ్లు పైబడిన వారు 844 మంది, ఫారం-7కు సంబంధించి 209 మంది, ఫారం-8కి సంబంధించి 126 మంది మొత్తం 2007 మంది దరఖాస్తులు సమర్పించారని అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఉంగుటూరు తహశీల్దార్ ఎవి.రమణరావు తెలిపారు.

ముసునూరు: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందాలని తహశీల్దార్ దాసరి సుధ అన్నారు. ఆదివారం మండలంలోని 16 గ్రామాల్లో నూతనంగా ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తుల స్వీకరణకు ఏర్పాటు చేశామని చెప్పారు.

సబ్సిడీపై డీజిల్ సరఫరా చేయండి

కమిషనర్ షేక్ షాహిద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో వినియోగిస్తున్న వాహనాలకు సబ్సిడీపై డీజిల్ సరఫరా చేసేందుకు పెట్రోల్ బంక్ యజమానులు, డీలర్లు సహకరించాలని కమిషనర్ షేక్ షాహిద్ అన్నారు. తన ఛాంబర్‌లో పెట్రోల్ బంక్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులతో ఆయన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాహనాలకు నెలకు సుమారు 15 వేల లీటర్ల డీజిల్ అవసరమవుతుందన్నారు. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం కాకుండా తక్కువ రేటుకు డీజిల్ సరఫరా చేయాలని సంబంధిత పెట్రోల్ బంక్ డీలర్లను కమిషనర్ కోరారు. ప్రతినెలా సరఫరా చేసిన డీజిల్‌కు సంబంధించి బిల్లు వెంటనే మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇ వెంకటేశ్వరరావు, ఎగ్జామినర్ రాజు, ఎఇ సాయి, నగరంలోని పెట్రోల్ బంక్ యజమానులు, డీలర్లు పాల్గొన్నారు.

హామీలు.. శంకుస్థాపనలేనా..

కార్యాచరణ ఎప్పుడో..!



- వాటర్‌గ్రిడ్ పథకంపై ఆర్భాటపు ప్రకటనలు
- ఫిషింగ్ హార్బర్ కల సాకారమయ్యేదెన్నడో
- తీర ప్రాంతానికి ఫుడ్ పార్కు తరలింపు మరిచారే
- గోదావరిపై వంతెన నిర్మాణం మాటేమిటో
- నేడు నరసాపురంలో సిఎం జగన్ పర్యటన

ప్రజాశక్తి - భీమవరం

సిఎం జగన్ సోమవారం నరసాపురంలో పర్యటించనున్నారు. సుమారు రూ.రెండు వేల కోట్లకుపైగా విలువైన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. నూతనంగా భీమవరం కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారి సిఎం ఈ జిల్లాకు రానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లావాసులు సిఎం జగన్ తమ సమస్యలపై స్పందించాలని కోరుతున్నారు.

నాడు ప్రతిపక్ష నేతగా జగన్ పాదయాత్ర ప్రస్తుత పశ్చిమగోదావరి జిల్లాలో ప్రధాన పట్టణాల మీదుగా సాగింది. ఆ సందర్భంగా పలు హామీలు ఇచ్చారు. అలాగే ఎన్నికల ప్రచారంలోనూ స్పష్టమైన హామీలు మరోసారి గుప్పించారు. అయితే వాటిలో కొన్నింటికి సంబంధించి సోమవారం శంకుస్థాపనలు చేయనుండగా మిగిలిన వాటి సంగతేంటని జనం ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా డెల్టా వాసుల ప్రాణాలను హరిస్తున్న కలుషిత నీటి నుంచి కాపాడి అందరికీ రక్షిత నీరు అందించేలా వాటర్‌గ్రిడ్ పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకొచ్చాక అప్పటి మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కూడా వేల కోట్లు ఈ పథకానికి కేటాయించినట్లు ప్రకటనలు గుప్పించారు. అయితే అవేమీ గడప దాటలేదు. దీంతో శంకుస్థాపన స్థాయి దాటని పరిస్థితి ఉంది. మరోసారి తాగునీటి సరఫరాకు పథకం అంటూ శంకుస్థాపన చేయనున్నారు. ఇదైనా ఎప్పటికి కార్యరూపం దాల్చుతుందోనని అంతా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలోనూ, ఈ ప్రభుత్వ హయాంలోనూ శంకుస్థాపనల పర్వం సాగుతూనే ఉంది. ఇక కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం అనేది ఈనాటిది కాదు. అందువల్ల వీటన్నింటికీ శంకుస్థాపన చేయడం సంతోషకరమే అయినా ఎప్పటికి కార్యరూపం దాల్చుతున్నాయనేది ప్రశ్నార్థకమేనని అంతా వ్యాఖ్యానిస్తున్నారు.

ఇక మిగిలిన హామీల మాటేమిటని ఆయా ప్రాంతాల వాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో తుందుర్రు ప్రాంతంలో నిర్మాణం చేపట్టిన మెగా ఆక్వా ఫుడ్ పార్క్‌కు వ్యతిరేకంగా జనం పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం అదే రీతిలో నిర్బంధకాండకు పాల్పడింది. అక్రమ కేసులు బనాయించి రోజుల తరబడి జైళ్లలో నిర్బంధించింది. ఆ సందర్భంగా ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ ఈ ప్రాంత పర్యటన సందర్భంగా తాము అధికారంలోకి రాగానే ఫుడ్‌పార్క్‌ను తీర ప్రాంతానికి తరలిస్తామని ప్రకటించారు. జగన్ అధికారం చేపట్టి మూడున్నరేళ్లయింది. నాటి నుంచి నేటి వరకూ ఆ ఫ్యాక్టరీ తరలింపు ఊసే లేదు. ఈ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడిన నేతలు, ప్రజలు మాత్రం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. మరి ఈ హామీపై జగన్ నరసాపురం పర్యటనలో పెదవి విప్పుతారో లేదో వేచిచూడాలి.

ఇక నరసాపురం పట్టణాభివృద్ధిలో వెనుకబడటానికి ప్రధాన కారణం గోదావరిపై వంతెన నిర్మాణం జరగకపోవడమేనని ఆ ప్రాంత ప్రజలు, వ్యాపారవేత్తలు తరచూ చెబుతుంటారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి ఎన్‌టిఆర్ ప్రభుత్వ హయాం నుంచి శంకుస్థాపనలైతే చేస్తున్నారుగాని పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. ఇక్కడ గోదావరి ఉధృతి ఎక్కువగా ఉండటంతో వంతెన డిజైన్‌లో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు. శంకుస్థాపన చేస్తున్న నేతలు తర్వాత ఈ కారణాన్ని సాకుగా చూపి పనులను అటకెక్కిస్తున్నారు. మరి సిఎం జగన్ ఈ పర్యటనలో ఈ వంతెన నిర్మాణంపై ఏమైనా స్పష్టతనిస్తారో లేదో వేచిచూడాలి.

కొల్లేరు కాంటూరు కుదింపు అంశం అలానే పెండింగులో ఉంది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లోని పేదలు ఇప్పటికీ ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే కాళీపట్నం జమిందారీ భూముల అంశం, ఆక్వా కాలుష్యం, అధ్వానంగా తయారైన రోడ్లు, వ్యవసాయాధారిత పరిశ్రమల ఏర్పాటు, నూతన జిల్లా కేంద్రంలో భవనాల నిర్మాణం, వసతుల కల్పన తదితర సమస్యలు సిఎం జగన్‌కు సాదర స్వాగతం పలుకుతున్నాయి. వీటిపై ఆయన ఏమైనా స్పందిస్తారా లేక కేవలం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకే పరిమితమవుతారా అని జనం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

8 నుంచి వ్యకాస రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - ముదినేపల్లి

జంగారెడ్డిగూడెంలో వచ్చే నెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఈ మేరకు ముదినేపల్లిలో ఆదివారం మహాసభ కరపత్రాలు అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల స్థితిగతులపై ఈ మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు.

ముసునూరు : డిసెంబర్ 8, 9, 10వ తేదీల్లో జంగారెడ్డిగూడెంలో నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల నాయకులు పి.మురళి కోరారు. మండలంలోని సిపిఎం కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ప్రత్యేక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో కోండుబోయిన రామకృష్ణ, లింగనేని రాధాకృష్ణ, పిన్నిబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'చాగంటికి పురస్కారం.. గురజాడకు అవమానం'

ప్రజాశక్తి - ఏలూరు

వందేళ్ల క్రితమే మూఢ నమ్మకాలు, సమాజంలోని ఛాందస భావాలకు వ్యతిరేకంగా రచనలు చేసి, బాల్య వివాహాలను వ్యతిరేకించి, వితంతు వివాహాలను ప్రోత్సహించిన మహాకవి గురజాడ అప్పారావు అని, అటువంటి అభ్యుదయ కవి పేరుతో చాగంటి కోటేశ్వరరావుకు పురస్కారం అనేది గురజాడను అవమానించడమే అవుతుందని హేతువాద సంఘం జిల్లా అధ్యక్షులు కడలి రామాంజనేయులు అన్నారు. ప్రవచనాలు పేరుతో స్త్రీలను కించపరిచే విధంగా మాట్లాడుతూ, ఛాందస భావాలను ప్రచారం చేసే చాగంటి ఈ పురస్కారానికి అనర్హుడని ఆయన అన్నారు. ఈ విషయంలో విజయనగరంలోని గురజాడ సాంస్కృతిక సమాఖ్య వారు పునరాలోచించాలని రామాంజనేయులు కోరారు.

హమాలీలు ఐక్యంగా పోరాడాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

హమాలీ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పోరాడాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఏలూరు అగ్రికల్చరల్ మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ బాధ్యతలు చేపట్టే కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. ఐఎఫ్‌టియు నగర అధ్యక్షులు కాకర్ల అప్పారావు అధ్యక్షతన ఆదివారం మార్కెట్ యార్డులో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు(యువి), నగర ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, మార్కెట్ యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రెడ్డి అప్పలనాయుడు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్, పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రామ్మోహన్ మాట్లాడారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మంచి ఆహారం ఆరోగ్యానికి కారణమని, తీసుకునే ఆహార లోపం, దానికి తోడు అస్తవ్యస్త జీవనవిధానం మానవుడిని అనారోగ్యానికి గురి చేస్తోందని ప్రఖ్యాత ఆరోగ్య నిపుణులు, స్వతంత్ర శాస్త్రవేత్త, కృషిరత్న డాక్టర్ ఖాదర్ వలి అన్నారు. స్థానిక శేషాద్రి నగర్‌లోని గౌరీసుభద్ర పిరమిడ్ ధ్యానమందిరం, అనుబంధ మైత్రేయ మందిరంలో ది జంగారెడ్డిగూడెం పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ నిర్వహణలో ఆరోగ్యంపై అవగాహనా సదస్సు ఆదివారం రెండో రోజు కొనసాగింది. ముఖ్యఅతిథిగా మైసూరుకు చెందిన డాక్టర్ ఖాదర్ వలి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మిల్లెట్స్ రాంబాబు, కర్తల్ కైలాసపురి పిరమిడ్ అధ్యక్షులు విజయభాస్కరరెడ్డి, పత్రీజీ ఆంతరంగిక కార్యదర్శి శివప్ప, ప్రొఫెసర్ గంగిరెడ్డి, ఆకివీడు పతాంజలి యోగా కేంద్రం అధ్యక్షులు పిబి.ప్రతాప్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ ప్రోత్సాహకులు సుబ్రహ్మణ్యరాజు, కెఎల్ఎన్.ధనకుమార్ పాల్గొన్నారు.

మహిళలకు గరికపాటి క్షమాపణ చెప్పాలి : ఐద్వా

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మహిళలను కించపరుస్తూ మాట్లాడిన గరికపాటి నరసింహారావు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఐద్వా మండల కార్యదర్శి నేలటూరి నిర్మల డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఐద్వా మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు ధరించే వస్త్రాధారణను కించపరచడం సరికాదన్నారు. బిఎస్‌పి నాయకురాలు మాయావతిని ఏనుగుతో పోల్చటం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో జి.ప్రమీల, జక్కుల రాణి, సిరిబత్తుల పార్వతి, పసుపులేటి స్పందన పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు అందజేత

కైకలూరు రూరల్ : ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా నియోజకవర్గంలోని కాపు పెద్దలతో కలిసి నియోజకవర్గంలోని రెండు వేల మంది వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. పట్టణంలోని విజ్ఞాన్ కాలేజీలో ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపిలు ఉమామహేశ్వరరావు, రామిశెట్టి సత్యనారాయణ, పెద్దిరెడ్డి రాము మాట్లాడుత నియోజకవర్గంలో 11 ఏళ్లుగా ఏడాదికోసారి పేద వృద్ధులకు నూతన వస్త్రాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు చెన్నంశెట్టి కోడందరామయ్య, మాజీ ఎంపిపి చెన్నంశెట్టి మురళీకష్ణ పాల్గొన్నారు.

ఎపి ఫైబర్ నెట్ ప్రసారాలకు అంతరాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలో ఎపి ఫైబర్ ద్వారా ప్రసారాలు, ఇంటర్నెట్ సేవలకు అంతరాయం ఏర్పడింది. గత మూడు రోజులుగా ఎపి ఫైబర్ వినియోగదారులు ఇంటర్నెట్, టీవీ ప్రసారాలు నిలిచిపోవడంపై తీవ్ర అసహనం చెందుతున్నారు. ఆదివారం సంబంధిత ఆపరేటర్లను సంప్రదించినప్పటికీ స్పందించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సేవలు నిలిచిపోయినప్పటికీ వినియోగదారుల నుంచి నెలకు రూ.350 నుంచి రూ.750 వరకు వసూలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. సంబంధిత పర్యవేక్షణ అధికారులు దృష్టి సారించి సేవలను సక్రమంగా అందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైసిపిది అసమర్ధ పాలన : టిడిపి

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

అసమర్థ వైసిపి ప్రభుత్వానికి ఇవి చివరి రోజులని మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని ఆచవరం శివారు ఆనందరావుపేటలో ఆదివారం నిర్వహించిన బాదుడే బాదుడు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చి మూడేళ్లు దాటినా ఒక్క గ్రామంలో అయినా కనీసం డ్రెయినేజీ నిర్మించలేదన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాధరాజు, ప్రధాన కార్యదర్శి పి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పంబలో కొరివిరామన్నగూడెం వాసి మృతి

టి.నరసాపురం : శబరిమలైకు వెళ్తుండగా పంబ నదిలో మండలంలోని కొరివిరామన్నగూడెం (కొరివిగూడెం) గ్రామానికి చెందిన వ్యక్తి జోనుబోయిన ధర్మరాజు (40) మృతి చెందాడు. వివరాల ప్రకారం... టి.నరసాపురం పంచాయతీ పరిధిలోని కొరివిగూడెం గ్రామానికి చెందిన తొమ్మిది మంది అయ్యప్ప స్వామి మాలధారులు ఈ నెల 14న సోమవారం శబరిమలైకు బయలుదేరారు. వీరితో పాటు మాలవేయని సివిల్‌లో మరో ముగ్గురు వెళ్లారు. వీరిలో గ్రామానికి చెందిన ధర్మరాజు కూడా ఉన్నాడు. ఈ క్రమంలో 12 మంది శబమలైకు వెళ్తున్న క్రమంలో ఈ నెల 16న పంబనది వద్ద ఆగారు. నదిలో దిగిన ధర్మరాజు ఎంతకీ తిరిగిరాలేదు. 16వ తేదీ మధ్యాహ్నం నుంచి కనిపించకపోవడంతో రెండు రోజులు వాళ్లతో పాటు వెళ్లిన స్వాములు వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో 18వ తేదీ స్థానికుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన కేరళ రాష్ట్ర పోలీసులు పంబ నది వద్ద సీసీ పుటేజీలను పరిశీలించి వాటి ఆధారంగా 20వ తేదీ మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో పంబ నదిలో మృతదేహాన్ని గుర్తించి సమాచారం తెలిపారు. సంఘటనా స్థలంలో మృతుని బట్టలు, బ్యాగు ఒక చోట పెట్టి ఉండడాన్ని బట్టి ధర్మరాజు నది స్థానానికి వెళ్లి జారి పడి నదిలో మునిగి చనిపోయి ఉంటాడని చెబుతున్నారు. మృతునికి భార్య వెంకటేశ్వరమ్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శబరిమలై యాత్రకు వెళ్లిన ధర్మరాజు మృతి సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

కోడిపందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - ఏలూరు

పెదవేగి మండలంలోని జగన్నాధపురంలో కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 25 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆ స్థావరంలో 35 బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

గ్రామాభివృద్ధే లక్ష్యం

శ్రీహరిపురం సర్పంచి విశ్వేశ్వరరావు



సర్పంచి పరసా విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి - ముదినేపల్లి

గ్రామాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని మండలంలోని శ్రీహరిపురం గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ శ్రీహరిపురం మేజర్ పంచాయతీ అని, పంచాయతీ పరిధిలో ఐనంపూడి, స్తంభంచెరువు, చేవూరుపాలెం, హస్తినపురం శివారు గ్రామాలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల్లో సుమారు నాలుగువేల జనాభా ఉన్నారన్నారు. గతంలో అనేక సమస్యలతో సతమతమవుతున్న శ్రీహరిపురం పంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సర్పంచిగా పని చేసేందుకు తొలిసారి అవకాశం లభించిదన్నారు. 2021 ఎన్నికల్లో త్రిముఖ పోటీలో గెలుపొందానని తెలిపారు. వివిధ ప్రాంతాల్లో గతంలో అసంపూర్తిగా ఉన్న సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందిలేకుండా చేస్తానన్నారు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.

చేసిన అభివృద్ధి పనులు

సర్పంచిగా బాధ్యతలు చేపట్టిన గ్రామంలో మంచినీటి కొరతను అధిగమించేందుకు చేవూరుపాలెంలో రెండో మంచినీటి పథకం నిర్మాణం కోసం చెరువును రూ.3.5 లక్షలతో తవ్వామని చెప్పారు. గ్రామంలో రూ1.12 లక్షలతో పోటు చెరువు తవ్వకం పనులు చేశామన్నారు. రూ.4.75 లక్షలతో చేవూరుపాలెంలో రెండో రక్షిత మంచినీటి పథకం చెరువు సంపు నిర్మించినట్లు చెప్పారు. శ్రీహరిపురంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పంచాయితీ పరిధిలోని స్తంభం చెరువులో రూ.మూడు లక్షలతో రెండు జెఎస్‌పి రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. రూ.లక్షతో శ్రీహరిపురం శ్మశానం మెరక పనులు, రూ.లక్షతో మంచినీటి చెరువు శుభ్రం, మంచినీటి పథకం వద్ద ఉన్న మోటార్ల మరమ్మతులు, పైపులైన్ లీకేజీ మరమ్మతులు చేసినట్లు తెలిపారు. రెండుపూటల గ్రామస్తులకు స్వచ్ఛమైన మంచినీటిని కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. చేవూరుపాలెం శ్మశానం మెరక, ముళ్లపొదలు తొలగించామన్నారు. ఈ పనులన్నీ పంచాయతీ నిధులతో చేసినట్లు చెప్పారు. జెడ్‌పిఎస్‌సి ప్లస్ జిపి ఫండ్స్ నుంచి రూ.4 లక్షలతో చేవూరుపాలెంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ప్రభుత్వం రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం నిర్మించినట్లు తెలిపారు.

చేయాల్సిన పనులు

రెండో మంచినీటి పథకం చెరువుకు ఫిల్టర్ బెడ్స్ కట్టడానికి రూ.పది లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా రూ.40 లక్షలు పంచాయతీకి మంజూరయ్యాయని, పని చేసేందుకు ఎవరూ ముందుకు రావడంలేదన్నారు. గ్రామం మొత్తంలో డ్రెయినేజీ సమస్య ప్రధానమైందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి తనశక్తి కొలది కృషి చేస్తానన్నారు. గ్రామంలో ఇళ్ల స్థలాల కోసం 60 మంది ధరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి ఇళ్లస్థలాలు మంజూరు కోసం తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. శ్రీహరిపురం పంచాయతీలో 20 ఏళ్ల క్రితం మంచినీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైపులైన్ పాడై తరచూ లీకేజీలు ఏర్పాడుతున్నాయన్నారు. నూతన పైపులైన్ నిర్మాణం చేపట్టాలన్నారు. పంచాయతీ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మిగిలిపోయిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. శ్రీహరిపురం రెండు బజారుల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. ఐనంపూడిలో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల స్థానంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. ఐనంపూడి నుంచి వడాలి వెళ్లే రోడ్డులో సీసీ రోడ్లు వేయాలన్నారు. గ్రామంలో ఎక్కడ ఏసమస్య ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. సింగరాయపాలెం శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆశీస్సులతో శ్రీహరిపురం గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని సర్పంచి పరసా విశ్వేశ్వరరావు తెలిపారు.

ఆవాస్ దివాస్ సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

అర్హులందరికీ పక్కా ఇంటి నిర్మాణం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆవాస్ దివాస్ సేవలను వినియోగించుకోవాలని గృహ నిర్మాణ సంస్థ ఉంగుటూరు సబ్‌డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యు.సోమేశ్వరరావు కోరారు. నియోజకవర్గ పరిధిలో నాన్ ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కింద నమోదైన పలు గ్రామాలు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కృషి ఫలితంగా ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలోకి వచ్చాయి. ఈ పరిధిలోకి వచ్చిన నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు మండలాల్లోని గ్రామాల్లో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు మార్గం సుగమమైంది. ఈ నేపథ్యంలో మండలంలోని కొల్లేరులంక గ్రామమైన చెట్టున్నపాడు గ్రామానికి ఈ పథకం కింద 89 ఇళ్లు మంజూరయ్యాయి. తొలి విడతగా ఇళ్ల నిర్మాణాలకు ముందుకు వచ్చిన 30 మంది లబ్ధిదారుల్లో నలుగురు ఆదివారం శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. ఇదే క్రమంలో చెట్టున్నపాడు గ్రామ సచివాలయంలో సర్పంచి జల్లూరి వెంకటనరసమ్మ అభిమన్యు అధ్యక్షతన లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమాల్ని నిర్వహించారు. అనంతరం లబ్ధిదారులకు గృహ నిర్మాణాలు మంజూరు చేస్తూ అనుమతి పత్రాలు, నిర్మాణాలు చేపట్టేవారికి అడ్వాన్స్ చెక్కుల పంపిణీ కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ భీమడోలు ఎఇ సిహెచ్.సతీష్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్, శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలిన వాసు, ఎంపిటిసి సభ్యులు వనమాల సుజాత పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆవాస్ దివాస్ కార్యక్రమంపై గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం ఈ ప్రాంతంలో గృహ నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారుల ఖాతాలో రూ.ఐదు వేలు జమ చేసినట్లు, లబ్ధిదారులకు రూ.1.80 లక్షలు మూడు దఫాలుగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ఇసుక, సిమెంటు, ఇనుమును ప్రభుత్వం నుంచి ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ గృహ నిర్మాణంలో భాగంగా ఉపాధి హామీ చట్టం, ఎస్‌హెచ్‌జి గ్రూపుల్లో లేని లబ్ధిదారులను నమోదు చేసేందుకు ఎపిఒ ఎపిఎంలకు ఈ కార్యక్రమంలో ముఖ్య పాత్ర పోషించాలని కోరారు.

అధికారులపై ఎంఎల్ఎ ఆగ్రహం

ఈ కార్యక్రమానికి గైర్హాజరైన మండల స్థాయి అధికారులపై ఎంఎల్ఎ బాలరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ ఏరియాలో సేవా దృక్పథంతో పనిచేయాలన్నారు. పని చేయడం ఇష్టం లేకపోతే వెళ్లిపోండని చెప్పారు. శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన ఉన్నతాధికారుల వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం రమణ, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, వైస్ ఎంపిపి జి.మోహన్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : జీలుగుమిల్లి గ్రామ సచివాలయ పరిధిలో ఆవాస్‌దివాస్ కార్యక్రమంలో ఎంపిపి కోర్స పోసమ్మ పాల్గొని గృహం మంజూరైన లబ్ధిదారులకు హక్కు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీలుగుమిల్లి పరిధిలో మొదటి విడతగా వంద మంది లబ్ధిదారులు ఎంపికయ్యారని, వారిలో 84 మందికి ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జగదాంబ, ఎంపిడిఒ కె.మంగతాయారు, ఎపిఎం రామారావు, హౌసింగ్ ఎఇ సీతారాం పాల్గొన్నారు.

విస్తరణ పనులు..పలు ఇబ్బందులు

రహదారికి అడ్డంగా వాహనాల నిలుపుదల
ఇబ్బందుల్లో ప్రయాణికులు, వాహనదారులు
విరిగిపోతున్న తాగునీటి పైపులైన్లు
గుత్తేదారుని తీరుపై ప్రజల విమర్శలు



రోడ్డుకు అడ్డంగా నిలిపిన వాహనం

ప్రజాశక్తి - మండవల్లి

జాతీయ రహదారి పామర్రు దిగమర్రు 165 విస్తరణ పనులు మండవల్లిలో ముమ్మరంగా సాగుతున్నాయి. గుత్తేదారుడు పనులు ప్రారంభించి రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించాడు. డ్రెయినేజీని ఏర్పాటు చేసేందుకు వినియోగించే పలు రకాల వాహనాలను రహదారికి అడ్డంగా ఇష్టానుసారంగా నిలుపుదల చేసేస్తున్నారు. డ్రెయినేజీలో కాంక్రీట్ పోసే సమయంలో కాంక్రీట్ మిక్సర్ వాహనాలను రహదారిపై ఇష్టానుసారంగ గంటల తరబడి నిలుపుదల చేస్తున్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నా యని, వాహనదారులు జాగ్రత్తగా వెళ్లాలని తెలియజేసే సంబంధిత సూచిక బోర్డులను కూడా ఎక్కడా ఏర్పాటు చేయలేదు. డ్రెయినేజీ ఏర్పాటు చేయడానికి ఎస్కవేటర్‌ను ఉపయోగించి ఇష్టానుసారంగా తవ్వకాలు చేపడుతుండడం తో గ్రామానికి మంచినీటిని సరఫరా చేసే పైపులు విరిగిపోతున్నాయి. గుత్తేదారుడు స్పందించి సకాలంలో మరమ్మతులు చేయడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు .దీంతో 20 రోజుల నుంచి తాగేందుకు నీరు లేక నానా అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పాడైపోయిన పైపుల నుంచి స్వచ్ఛమైన తాగునీరు వృధాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వివరిస్తున్నారు. గుత్తేదారుడు విస్తరణ పనులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు చర్చించినట్లు చెబుతు న్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జాతీయ రహదారి విస్తరణ పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్న గుతదారులపై చర్యలు తీసుకుని సూచక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై ఇన్‌ఛార్జి తహశీల్దార్ శ్రీనివాసరావును వివర కోరగా డిఇతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ధలరామ్‌కు పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి - ముసునూరు



ధలరామ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

అమెరికా పర్యటన ముగించుకుని స్వగ్రామం ముసునూరుకు వచ్చిన టిడిపి మండల అధ్యక్షులు దేవినేని ధలరామ్ మండల నాయకులు స్వాగతం పలికి స్వదేశగమన శుభాకాంక్షలు తెలిపారు. ధలరామ్‌కు టిడిపి మండల నాయకులు కోండేటి బాబి, పాకనాటి సీతారామ్, గారపాటి నరసింహారావు, నక్కా యోహాన్, తోట శ్రీనివాసరావు, గద్దల మోహనరావు, జోనుబోయిన రాంబాబు, మానికల నాగసాయి, కలపాల దావదాసు, ముళ్లపూడి సులోమన్, మద్దాల జాన్, మానికల సాయి రాంబాబు, చింతా వెంకట రాంబాబు, గోగం కాసులు, నల్లిబోయిన రాంబాబు, పుల్లిబళ్ల సత్యనారాయణ, రెడ్డి కృష్ణ, తుమ్మల లక్ష్మణరావు స్వదేశగమన శుభాకాంక్షలు తెలిపారు.

బాలల హక్కులపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ఏలూరు

బాల వికాస్ భారతి, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆ కేంద్రంలో ఆదివారం బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. బినెక్స్ జెన్-మానవతా సంస్థల సహకారంతో బాల బాలికలకు పౌష్టికాహారం అందించారు. బాల వికాస్ భారతి సేవా సంస్థ ప్రెసిడెంట్ ఎస్ఎన్.కట్టా సభకు అధ్యక్షులుగా వ్యవహరిస్తూ బాలల హక్కుల ప్రాధాన్యతను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన మానవతా విద్యా నిధి ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ కోచ్ బొత్స శ్రీను, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ గుడిపాటి నరసింహారావు, కేంద్రం నాయకులు విజిఎంఆర్.కృష్ణారావు, బాలవికాస్ భారతి జాయింట్ సెక్రటరీ బొంతు పెదబాబు, ట్రెజరర్ కట్టా ధార్మిక ఆనంద శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతలపూడి : భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులు, విధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఇబ్రహిం షరీఫ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రపంచ బాలల దినోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



ఆగిరిపల్లిలో బహుమతులు అందిస్తున్న ఇస్సాక్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గ్రంథాలయాల ద్వారా విశేషమైన విద్యను సముపార్జన చేసుకోవచ్చని వైసిపి నాయకులు, ఈదర గ్రామ ప్రముఖులు గోళ్ల ఇస్సాక్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వారం రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు సాదం గోపినాథ్, వ్యవసాయ సలహా మండలి ఆగిరిపల్లి మండల ఛైర్మన్ దాసరి రామారావు, టిడిపి నాయకులు చవటపల్లి విక్టర్‌బాబు పాల్గొన్నారు.

చింతలపూడి : గ్రంథాలయాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని వైసిపి చింతలపూడి పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు అన్నారు. చింతలపూడి గ్రంథాలయంలో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు వేడుకలో ఆటలు, డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు గ్రంథాలయ ఛైర్మన్ ఆధ్వర్యంలో బహుమతులు అందించారు.

భీమడోలు : మండల పరిధిలోని గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఆయా గ్రంథ పాలకులు అమర్‌నాథ్, నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. గుండుగొలనులో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుండుగొలను సొసైటీ అధ్యక్షులు వివివి.భాస్కర్ విజేతలకు బహుమతులు అందించారు. పూళ్లలో సర్పంచి దాయం సుజాతప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయంలో పుస్తకాల కొనుగోలుకు మానవతా సంస్థ రూ.ఐదు వేలు, పుప్పాల రామ్మోహన్‌రావు రూ.ఐదు వేలు, పులిచర్ల వెంకటకృష్ణారావు రూ.1100 విరాళాలను అందించారు. భీమడోలులో ముగింపు కార్యక్రమాలు సోమవారం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆదివారం డిజిటల్ లైబ్రరీ లాభాల అంశంపై అవగాహనా సదస్సు, క్విజ్ పోటీలు నిర్వహించారు.

కొయ్యలగూడెం : స్థానిక శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపిపి గంజిమాల రామారావు హాజరయ్యారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

చాట్రాయి : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. వారం రోజులుగా విద్యార్థులకు నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు.

మండవల్లి : స్థానిక గ్రంథాయలంలో ఆదివారం నిర్వహించిన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో సుధామ ఫౌండేషన్ అధినేత శాస్త్రవేత్త సుధాబత్తుల విజయకుమార్ పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

దెందులూరు : పోతునూరు శాఖా గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోతునూరు సర్పంచి బోదుల స్వరూప్, ఎంపిటిసి సభ్యులు సున్నా నరేష్, రిటైర్డ్ లైబ్రేరియన్ బెజవాడ వరప్రసాద్, హై స్కూల్ లెక్కల మాస్టర్ ఎస్‌కె.ఆసేన్‌వల్లి హాజరయ్యారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

నిడమర్రు : స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

బుట్టాయగూడెం : స్థానిక గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పలు పోటీల్లో విజేతలకు ఎంఎల్ఎ బాలరాజు బహుమతులు అందించారు. అనంతరం ఎంఎల్ఎ బాలరాజును గ్రంథాలయ సిబ్బంది దుస్సాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామ తులసి, గ్రంథాలయాల లైబ్రేరియన్ ఎస్.రామలక్ష్మి పాల్గొన్నారు.

టి.నరసాపురం : స్థానిక శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు గ్రంథ పాలకులు ఆర్.కిషోర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సర్పంచి మోదుగు సునంద హాజరయ్యారు. విజన్ స్కూల్ విద్యార్థులు పాడిన అభ్యుదయ గేయాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఏలూరు అర్బన్ : ఏలూరులోని బాలల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి ఈ ముగింపు కార్యక్రమానికి డిప్యూటీ తహశీల్దార్ శ్రీపురం చలపతిరావు, పైడి సురేఖ భీమేశ్వరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఇన్నర్ వీల్ క్లబ్ తరపున గంగా భవాని గ్రంథాలయానికి ఫ్యాన్లు అందించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పుస్తకాలను బహుకరించారు.

గణపవరం : స్థానిక గ్రంథాలయంలో గణపవరం సర్పంచి మోర అలంకారం అధ్యక్షతన ఆదివారం ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గణపవరం మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు సలాది రత్నదుర్గకుమారి మాట్లాడారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

కైకలూరు రూరల్ : స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు సభలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పాల్గొన్నారు. వివిధ పోటీలలో విజేతలకు ఆయన బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నవరత్నకుమారి, సాహితీవేత్త చింతపల్లి వెంకటనారాయణ, దానం ప్రసాద్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా ముదినేపల్లి, గురజ శాఖ గ్రంథాలయాల్లో వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

వసతి గృహంలో సిఎస్ డిటి పుట్టినరోజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని సివిల్ సప్లై డీటీ శేఖర్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఆదివారం స్థానిక ఎస్‌సి బాలికల వసతి గృహంలో విద్యార్థులకు కేకు, పండ్లు పంపిణీ చేశారు. తన పుట్టినరోజును పేద విద్యార్థుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.

22న కలెక్టరేట్ల వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్ తదితర బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.కృష్ణ, ఎం.జోగిరాజు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపులో భాగంగా ఈ నెల 22న ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ల వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేయనున్నట్లు వారు తెలిపారు.

పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం విద్యా రోహిణి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆంధ్ర రాధాస్వామి సత్సంగ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో సత్సంగ వైద్య నిపుణులతో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులు, కళ్లజోళ్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యా రోహిణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ కొండేపాటి రామకృష్ణ, పాల్గొన్నారు

చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు సరికావు : టిడిపి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడుపై వైసిపి ఎంపీ నందిగం సురేష్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని టిడిపి మండల కమిటీ సభ్యులు అన్నారు. ఈ మేరకు మండలంలోని గుర్వాయిగూడెం టిడిపి కార్యాలయం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. చంద్రబాబు నాయుడుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

చింతలపూడి : నందిగం సురేష్ చేసిన వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని టిడిపి మండల నాయకులు అన్నారు. చంద్రబాబుపై ఎంపి నందిగం సురేష్ అనుచిత వ్యాఖ్యాలు చేయడంపై దళితుల ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఆదివారం టిడిపి నాయకులు నిరసన తెలిపారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 23/2017
ఓ.ఎస్.నెం. 321/2011

బిట్వీన్:
మాకా నాగేశ్వరరావు ...డి. హెచ్.ఆర్
Vs
పర్వతాల ఆంజనేయులు ...జె.డి.ఆర్

పై నెంబరు ఇ.పి. నందు శ్రీ కోర్టు వారు షెడ్యూలు ఆస్తిని **ది.08-12-2022వ తేదీన వేలం జరుపుటకు ఉత్తర్వులు ఇచ్చినారు.** కావున షెడ్యూలు ఆస్థి యొక్క వేలము పై కోర్టులో ఉదయం గం॥ 10:30 ని॥లకు నిర్వహించెదరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు

ప॥గో॥జిల్లా, ప్రస్తుతం ఏలూరు జిల్లా, తాడేపల్లిగూడెం సబ్ డివిజన్, ఉంగుటూరు మండలం, ఉప్పాకపాడు గ్రామం జిరాయితీ పల్లం, సర్వే నెం.451/2 నందు య.0-50 సెంట్లుకు హద్దులు:
తూర్పు: మంచాల వీరరాఘవమ్మ గారి భూమి.
పడమర: మాకా చినపోతురాజు గారి భూమి.
ఉత్తరం: మాకా వెంకటలక్ష్మి గారి భూమి.
దక్షిణం: పుంత.

అమీనా కిమ్మత్తు
జప్తు సమయమందు : రూ.2,50,000/-
టెస్టు వారెంటు సమయమందు : రూ.18,00,000/-

జి.కె.దుర్గాదేవి
వాది తరుపు అడ్వకేట్,
తాడేపల్లిగూడెం, తాడేపల్లిగూడెం.
19-11-22. సెల్: 9985592775

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE :: ELUU
E.P.No.6/2021, O.S.No.416/2015

Between:
Sri Mavuluri Srinivas ...DHR
Vs
Sri Chintapalli Veera Sesha Rao ...JDR

పై నెంబరు గ్రంధములో జె.డి.ఆర్. స్వాధీన హక్కు భుక్తములో ఉన్న ఈ దిగువ ఇ.పి. షెడ్యూలు ఆస్థిని **ది.09-12-2022వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట బహిరంగముగా వేలము వెయ్యబడును.** కావున వేలము పాటలో పాల్గొనే వారు తమ ఆధారు కార్డుతో ఉదయం గం॥ 10:30 ని॥లకు వచ్చి వేలముపాటలో పాల్గొనవలసిందిగా కోర్టు వారు ఆర్డరు ప్రకారం ఇందుమూలముగా తెలియజేయడమైనది.

SCHEDULE

West Godavari District, Velagapadu Village and Panchayat, T.Narasapuram Mandal, Kamavarapukota Sub Division, Zaroyet R.S.No.100/3, AC. 1-88 Cents out of AC. 3-76 Cents and R.S.No. 100/4, AC. 0-15 Cents out of AC. 0-30 Cents, one campact block total extent of AC. 2-03 Cents.

Bounded By: Item No.1:
East: Jajula Rama Swamy Land.
South: Allamcharla Rajupalem to Barrampalem Road.
West: Velagapadu Village.
North: Chintapalli Nageswara Rao.
DHR Value : Rs.10,00,000/-
Amin Value : Rs.20,30,000/-

Item No.2:
West Godavari District, Velagapadu Village and Panchayat, T.Narasapuram Mandal, Kamavarapukota Sub Division, Zaroyet R.S.No.133/1, AC. 1-70 Cents out of AC. 3-40 Cents.

Bounded By:
East: Government Puntha.
South: Chintapalli Nageswara Rao.
West: Defendent and Chintapalli Nageswara Rao.
North: Tank.
DHR Value : Rs.8,00,000/-
Amin Value : Rs.17,00,000/-

P.B.NARASIMHAMURTHY
Advocate, Eluru.
Cell: 98481 43125